క్లుప్తంగా

ఘనంగా స్వచ్ఛంద సేవా సంస్థల దినోత్సవం



నాగేశ్వరరావును సన్మానిస్తున్న అడబాల ట్రస్ట్ సభ్యులు

కాకినాడ రూరల్: రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో స్వచ్ఛంద సేవా సంస్థల దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మీ కోసం స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకుడు పిల్లి నాగేశ్వరరావు అడబాల ట్రస్ట్ చైర్మన్ రత్నప్రసాద్, గ్రంథాలయ విశ్రాంత ఉద్యోగి చింతపల్లి సుబ్బారావు, ఆధ్యాత్మిక వేత్త శిరీష, చంద్రరావు, సత్యనారాయణ తదితరులు సన్మానించారు.

నేడు ఉమర్ ఆలీషా జయంతి

కాకినాడ రూరల్: పిఠాపురంలోని విశ్వ విజ్ఞాన విద్యా ఆధ్యాత్మిక పీఠం ఆరవ పీఠాధిపతి కవిశేఖర డాక్టరు ఉమర్ ఆలీషా 139వ జయంతి సభను బుధవారం సర్పవరంలోని బోట్‌క్లబ్ వద్ద నిర్వహించనున్నట్టు ఆహ్వాన కమిటీకి చెందిన మండ ఎల్లమాంబ, కాకినాడ లక్ష్మి తెలియజేశారు. బోట్‌క్లబ్ వద్ద కవిశేఖర విగ్రహం వద్ద ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమంలో ప్రస్తుత, 9వ పీఠాధిపతి ఉమర్ ఆలీషా సద్గురువు పాల్గొంటారని వారు తెలిపారు. సభ్యులు పాల్గొనాలని కోరారు.

నేడు వేణుగోపాల స్వామి విగ్రహ ప్రతిష్ఠ



వేణుగోపాల స్వామి గ్రామోత్సవంలో పాల్గొన్న భక్తులు

కాకినాడ రూరల్: తిమ్మాపురంలో ప్రాచీనమైన వేణుగోపాల స్వామి ఆలయాన్ని పునర్నిర్మించడంతో బుధవారం స్వామి వారి విగ్రహాన్ని బుధవారం ప్రతిష్ఠించనున్నారు. ఈ ఆలయం నిర్మాణానికి ఎమ్మెల్యే కురసాల కన్నబాబు నిధులు మంజూరు చేయించారు. సర్పంచ్ బెజవాడ వీరవెంకట సత్యనారాయణ, ఆలయ కమిటీ చైర్మన్ బద్దిలి అచ్చారావు, ఈఓ పల్లాల కృష్ణారెడ్డి కృషితో ఆలయం నిర్మాణం పూర్తయింది. మంగళవారం సర్పంచ్ బెజవాడ సత్యనారాయణ దంపతులు ఆధ్వర్యంలో గ్రామోత్సవం నిర్వహించారు. బుధవారం ఉదయం 10.02 గంటలకు విగ్రహ ప్రతిష్ఠాపన, ధ్వజ స్తంభ ప్రతిష్ఠ నిర్వహించనున్నారు.

ఉష బాక్సింగ్‌లో లోవరాజుకు కాంస్య పతకం



లోవరాజును అభినందిస్తున్న జిల్లా సెక్రటరీ సుందరం

కరప: జార్ఖండ్ రాష్ట్రం రాంచీలో జరిగిన ఉష బాక్సింగ్ పోటీలలో కరప మండలం జి.భావారం గ్రామానికి చెందిన యు.లోవరాజు మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకాన్ని సాధించాడు. రాంచీలో ఈ నెల 23, 24 తేదీలలో 7వ ఫెడరేషన్ కప్ 85 కిలోల విభాగంలో ఈ బాక్సింగ్ పోటీలు జరిగినట్టు లోవరాజు మంగళవారం స్థానిక విలేకరులకు తెలిపారు. బాక్సింగ్ అసోషియేషన్ జిల్లా సెక్రటరీ ఆర్.సుందరంను కల్సి పతకాన్ని, ప్రశంసా పత్రం చూపించగా అభినందించినట్టు లోవరాజు తెలిపారు. జి.భావారం సర్పంచ్ రొక్కాల గణేష్ తదితర గ్రామస్తులు లోవరాజును అభినందించారు.

ఐఎస్ఐ ప్రమాణాలు పాటించాలి



సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కల్పిస్తున్న సుజాత తదితరులు

కాకినాడ సిటీ: నిత్యావసర వస్తువులు మొదలుకొని ప్రభుత్వ రంగాల్లో వినియోగించే అన్ని వస్తువులకు ఐఎస్ఐ ప్రమాణాలు విధిగా పాటించాల్సిన అవశ్యకత ఎంతైనా ఉందని కాకినాడ బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్ ప్రతినిధులు జాయింట్ డైరెక్టర్ టి.సుజాత అన్నారు. మంగళవారం కాకినాడ జెడ్పీ సమావేశ మందిరంలో జగ్గంపేట, గండేపల్లి, ఏలేశ్వరం, గొల్లప్రోలు, సామర్లకోట, శంఖవరం, కాజులూరు, పెద్దాపురం, యు కొత్తపల్లి, తాళ్లరేవు మండలాల పంచాయతీ సర్పంచులకు, పంచాయతీ కార్యదర్శులకు బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్ నియమాలపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ ఎ.శ్రీరామచంద్రమూర్తి తదితరులు పాల్గొన్నారు.

దర్జీలకు చేదోడు

- ఏడాదికి రూ.10 వేల ఆర్థిక భరోసా
- రేపు టైలర్స్ డే



కరపలో దుస్తులు కుడుతున్న టైలర్

కరప: మానవ జీవితంలో దర్జీలకు ఓ ప్రత్యేక గుర్తింపు ఉంది. దుస్తుల ధారణ కనీస అవసరం కావడంతో దర్జీలకు తీవ్ర డిమాండ్ ఉండేది. ఒకప్పుడు సినీ హీరోలకు ఆకర్షణీయంగా దుస్తులు కుట్టిన యాక్స్ వంటి టైలర్లకు కూడా నటులకు ఉన్నంత పేరుండేది. అటువంటి దర్జీల జీవితం నేడు అంతంత మాత్రంగానే ఉంటోంది. ఆధునిక ప్రపంచంలో వ్యక్తుల అభిరుచుల్లో మార్పులు రావడం, వస్త్ర వ్యాపారంలో సాంకేతిక మార్పులు చోటుచేసుకోవడం, ఇత్యాది కారణాలతో రడీమేడ్ దుస్తులపై మోజు పెరగడంతో టైలరింగ్ వృత్తి ఆదరణ కోల్పోతోంది. టైలర్లను కానీ, ఈ వృత్తిపై ఆధారపడిన వారిని కానీ ఇంతవరకూ ఏ ప్రభుత్వం పట్టించుకోలేదు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక ఎవరూ చేయని విధంగా జగనన్న చేదోడు పథకం ద్వారా నాలుగేళ్లుగా టైలర్లకు ఏడాదికి రూ.10 వేలు వంతున ఆర్థిక సాయం అందించి ఆర్థిక భరోసా ఇస్తున్నారు. ఏటా ఫిబ్రవరి 28న టైలర్స్‌డే జరుపుకుంటారు. నియోజక వర్గంలో 800 మంది టైలర్లు ఉంటే కరప మండలంలోని 23 గ్రామాల్లో సుమారు 300 నుంచి 400 మంది వరకు టైలర్లు ఉన్నారు. వారిలో 150 మంది మహిళలుంటారు. ఒకప్పుడు కుటుంబ సభ్యులంతా ఇదే వృత్తిపై ఆధారపడి జీవించేవారు. నేడు పని కరువవ్వడంతో షాపింగ్‌మాల్స్‌లో పనిచేసేందుకు టైలరింగ్ వృత్తిపని వారు పట్టణాలకు వలసపోతున్నారు. వృత్తి సహాయకులైతే వస్త్ర దుకాణాల్లో పనిచేసేందుకు, సైకిళ్లపై వస్త్రాలను విక్రయిస్తూ జీవిస్తున్నారు. సంవత్సరంలో వచ్చే పండగలకు, వివాహాది శుభకార్యాల సమయంలోనే పని ఉంటుందని మిగిలిన రోజుల్లో షాపు అద్దె, కరెంటు చార్జీలు, కుటుంబ పోషణ భారమవుతోందని టైలర్లు అంటున్నారు. టైలర్లు ఆదరణ కోల్పోవటంతో, కొత్తగా నేర్చుకోవడానికి నేటితరం ముందుకురావడంలేదు. ఇదే వృత్తిలో కొనసాగాలనుకునేవారికి సహాయకులు కరువవుతున్నారని సీనియర్ టైలర్లు అంటున్నారు. టైలరింగ్ మెటీరియల్ ధరలు పెరిగిపోవడంతో, కుట్టుకూలీ రేటు పెంచాల్సి వస్తోందని దీంతో వినియోగదారులు రడీమేడ్ వైపు చూస్తున్నారని టైలర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గుర్తింపుకార్డులు ఇవ్వాలి

భవన నిర్మాణ కార్మికులకు, కల్లుగీత కార్మికులకు గుర్తింపు కార్డులిచ్చిన విధంగానే టైలర్లకు కూడా గుర్తింపు కార్డులిచ్చి ప్రభుత్వ పథకాల్లో ప్రాధాన్యతం ఇవ్వాలని దర్జీలు కోరుకుంటున్నారు. అలాగే ప్రభుత్వం స్పందించి మత్స్యకారులు, చేనేత, కల్లుగీత కార్మికులకు ఇస్తున్నట్టు 50 ఏళ్ల నిండిన టైలర్లకు కూడా పింఛన్లు మంజూరు చేయాలని కోరుకుంటున్నారు.

పింఛన్ మంజూరు చేయాలి



డిమాండ్ తగ్గినా టైలరింగ్ వృత్తిని నమ్ముకుని ఇందులోనే కొనసాగుతున్నాం. 25 ఏళ్లగా ఇదే వృత్తిలో ఉండటం వల్ల, వేరేపని చేయలేక, కష్టంగా ఉంటున్నా టైలరింగ్ ద్వారానే జీవనం సాగిస్తున్నాం. మత్స్యకార, చేనేత, కల్లుగీత కార్మికులకు ఇస్తున్నట్టే తమకూ పింఛను మంజూరు చేయాలి. ప్రభుత్వం స్పందించి దర్జీలకు బ్యాంక్‌ల ద్వారా రాయితీపై రుణాలు ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలి.

– గుండారపు గోవిందు, యాక్స్ టైలర్, కరప

సీఎం జగన్ ఆదుకుంటున్నారు



మార్కెట్‌లోకి రడీమేడ్ దుస్తులు రావడంతో టైలరింగ్ పనికి ఆదరణ తగ్గింది. ఎంత కష్టపడి పనిచేస్తున్నా శ్రమకు తగ్గ ఫలితం ఉండటం లేదు. ఎంతోకాలంగా ఇదేవృత్తిలో ఉండటంతో వేరేపని చేయలేక, ఇదేవృత్తిని నమ్ముకున్నాం. ముఖ్యమంత్రి జగన్ ఏడాదికి రూ.10 వేలు వంతున ఆర్థిక సాయం అందించి ఆదుకుంటున్నారు. టైలరింగ్ వృత్తినే నమ్ముకున్నవారికి ఇళ్ల స్థలాలు మంజూరుచేసి, సొంతింటి కలను సాకారం చేయాలి.

కొనసా రాజగోపాల్, సూపర్ టైలర్, కరప

ఆర్థిక సాయం అందిస్తున్నాం



మండల పరిధిలోని 23 గ్రామాల్లో షాపులు కలిగి ఉండి, టైలరింగ్ చేస్తున్న వారిని గుర్తించి, జగనన్న చేదోడు పథకం ద్వారా ఏడాదికి రూ.10 వేలు వంతున ఆర్థిక సాయం అందిస్తున్నాం. గతేడాది 125 మందికి జగనన్న తోడు అందించాం. ఇంత వరకు నాలుగు విడతలుగా చేదోడు పథకంలో ఆర్థిక సాయం అందించాం.

కె.అప్పారావు, ఎంపీడీఓ, కరపమండలం

పోలింగ్ స్టేషన్ల సందర్శన



పోలింగ్ స్టేషన్లను పరిశీలిస్తున్న ఈఆర్వో వెంకటరావు

కాకినాడ: నియోజకవర్గ ఈఆర్వో జె.వెంకటరావు మంగళవారం పలు పోలింగ్‌స్టేషన్లను సందర్శించారు. గాంధీనగర్, రామారావుపేట, రామకృష్ణారావుపేట, రేచర్లపేట, దుమ్ములపేట, శ్రీరామ్‌నగర్, జగన్నాథపురం, రాగంపేట, సినిమారోడ్డు ప్రాంతాల్లోని పోలింగ్ స్టేషన్లను పరిశీలించారు. కొన్ని పీఎస్‌లకు గతంలో ఉన్న పేర్లు మారిన నేపథ్యంలో వాటి వాస్తవికతను స్వయంగా నిర్ధారించుకున్నారు. అందుకు సంబంధించిన సమాచారాన్ని జిల్లా ఎన్నికల అధికారి దృష్టికి తీసుకువెళ్లి ప్రస్తుతం ఉన్న పేర్లను ఆయా పోలింగ్‌స్టేషన్లకు ఉంచేలా చర్యలు తీసుకోనున్నారు. అదే సమయంలో ఆయా పోలింగ్ స్టేషన్లలోని వసతులను కూడా ఆయన పరిశీలించారు.

నేడు సైన్స్ ఫెయిర్

పిఠాపురం: స్థానికంగా ఎస్ఆర్ ఫంక్షన్ హాలులో బుధవారం జాతీయ సైన్స్ డేను పురస్కరించుకుని మురాలశెట్టి సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో సైన్స్ ఫెయిర్ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు మంగళవారం తెలిపారు. ఈ సైన్స్ ఫెయిర్‌లో 30 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు పాల్గొంటారన్నారు. నైపుణ్యాన్ని ప్రదర్శించి ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లతో పాటు పతకాలు అందజేస్తామని వివరించారు.

పారదర్శకంగా ఓటరు దరఖాస్తుల పరిష్కారం



రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న ఈఆర్వో వెంకటరావు

- ఈఆర్వో వెంకటరావు
- రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం

కాకినాడ: ఎన్నికల కమిషన్ ఆదేశాలకు అనుగుణంగా రానున్న ఎన్నికలను సజావుగా నిర్వహించడంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు తమ వంతు తోడ్పాటు అందించాలని నియోజకవర్గ ఈఆర్ఓ, నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు కోరారు. కార్పొరేషన్ కార్యాలయంలో మంగళవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఓటర్ల తుది జాబితా ప్రచురణ అనంతరం తాజాగా ఫారం 6, 7, 8 ద్వారా వచ్చిన దరఖాస్తుల ప్రగతిని వివరించారు. ఇప్పటివరకు 10,482 దరఖాస్తులు రాగా 1005 తిరస్కరించామని, 6127 దరఖాస్తులను ఆమోదించామన్నారు. ఇంకా 3330 దరఖాస్తులు పరిష్కరించాల్సి ఉందన్నారు. వీటిని కూడా నిర్ణీత కాలవ్యవధిలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ సందర్భంగా ఆయా రాజకీయ పార్టీల ప్రతినిధుల సందేహాలను ఈఆర్వో నివృత్తి చేశారు. ఓటర్ల జాబితాపై పత్రికలలో వచ్చిన కథనాలను కూడా పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. నామినేషన్ల తేదీకి పది రోజుల ముందు వరకూ కొత్త ఓట్ల కోసం దరఖాస్తులు స్వీకరిస్తామని స్పష్టం చేశారు. ఓట్ల తొలగింపు దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి జిల్లా ఎన్నికల అధికారి ద్వారా ఎన్నికల కమిషన్ ఆదేశాల అనంతరమే తొలగిస్తున్నట్లు స్పష్టం చేశారు. సమావేశంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు రావూరి వెంకటేశ్వరరావు (వైఎస్సార్ సీపీ), తుమ్మల రమేష్ (టీడీపీ), అప్పారావు (బీఎస్పీ), ఏఈఆర్వోలు దొర, సీతాపతిరావు, మురళీకృష్ణ, గుంటూరు శేఖర్, హరిదాసు, నాగశాస్త్రులు, జాన్ బాబు తదితరులు పాల్గొన్నారు.

బీఎల్ఓల పాత్ర అత్యంత కీలకం



కార్యక్రమానికి హాజరైన బీఎల్ఓలు

రానున్న ఎన్నికలలో బీఎల్వోల పాత్ర అత్యంత కీలకమని సిటీ నియోజకవర్గ ఈఆర్ఓ, నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం స్థానిక స్మార్ట్ సిటీ కార్యాలయంలో ఎన్నికల విధులపై బీఎల్ఓలు, సెక్టార్ అధికారులకు శిక్షణ ఇచ్చారు. ఎన్నికలకు ముందు రోజు, ఎన్నికలు జరిగే రోజున పని చేసే విధానం, ఈవీఎం, వీవీ ప్యాట్ నిర్వహణ, ఇతర అంశాలపై శిక్షకులు వీరికి అవగాహన కల్పించారు. సందర్భంగా ఈఆర్వో మాట్లాడుతూ ఎన్నికల విధుల్లో ఉండే సిబ్బంది సందేహాలను నివృత్తి చేసుకొని, సంపూర్ణ అవగాహనతో ఎటువంటి లోటుపాట్లు లేకుండా ఎన్నికలు సజావుగా జరిగేలా కృషి చేయాలన్నారు. విధి నిర్వహణలో ఎటువంటి పొరపాట్లకూ తావు లేకుండా సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈఆర్‌వోలు దొర, సీతాపతిరావు, గుంటూరు శేఖర్, బీవీ మురళీకృష్ణ, హరిదాసు, నాగశాస్త్రులు, జాన్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతకు నిలయంగా కాకినాడ

- సిటీ ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి
- పేదలకు అన్న, వస్త్రదానం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ద్వారంపూడి, పార్లమెంట్ కో-ఆర్డినేటర్ చలమలశెట్టి సునీల్, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ తదితరులు

కాకినాడ: ఆధ్యాత్మికత, సేవాభావానికి నిలయంగా ఉన్న కాకినాడ వంటి ప్రాంతాల్లో మరెంతో మంది సేవాతత్పరులు ఉండడం ఈ ప్రాంత అదృష్టమని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. స్థానిక సినిమా రోడ్డు సంతచెరువు వద్ద కనకదుర్గ అమ్మవారి దేవస్థానం ఆవరణలో దుర్గామల్లేశ్వర షాపింగ్ కాంప్లెక్స్‌ను ఎమ్మెల్యే ద్వారంపూడి, కాకినాడ పార్లమెంట్ కో-ఆర్డినేటర్ చలమలశెట్టి సునీల్ మంగళవారం ప్రారంభించారు. జొన్నాడ సూర్యప్రకాశరావు (అబ్బాయి) జ్ఞాపకార్థం హరిహరపుత్ర ఫౌండేషన్ వ్యవస్థాపక చైర్మన్ జొన్నాడ చినబాబు ఆధ్వర్యంలో మహాన్నదానం, వస్త్రదానం నిర్వహించారు. తన తండ్రి పేరిట హరిహరపుత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో సుమారు 6 వేల మందికి ఈ దానాలు చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ద్వారంపూడి మాట్లాడుతూ చినబాబు సేవకు ప్రతిరూపంగా నిలిచారని ద్వారంపూడి ప్రశంసించారు. చలమలశెట్టి సునీల్ మాట్లాడుతూ పేదలను ఆదుకోవడంలో తన వంతు తోడ్పాటు ఉంటుందని హామీ ఇచ్చారు. రాష్ట్ర రైసుమిల్లర్ల సంఘ అధ్యక్షుడు ద్వారంపూడి వీరభద్రారెడ్డి మాట్లాడుతూ చినబాబు సేవలు ఆదర్శంగా నిలుస్తాయన్నారు. కార్యక్రమ నిర్వాహకులు, త్రిపురసుందరి ఆలయ కమిటీ మాజీ చైర్మన్ జొన్నాడ చినబాబు మాట్లాడుతూ విదేశాలలో ఉన్న తన కుమార్తె సూర్యతేజశ్రీ ప్రోత్సాహంతోనే హరిహపుత్ర ఫౌండేషన్ ద్వారా సేవలకు శ్రీకారం చుట్టినట్టు తెలిపారు. ఎమ్మెల్యే ద్వారంపూడి సతీమణి మహాలక్ష్మి ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, మార్కెట్‌కమిటీ చైర్‌పర్సన్ పసుపులేటి వెంకటలక్ష్మి, వైఎస్సార్ సీపీ నగరాధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, నాయకులు కర్రి వీర్రెడ్డి, గణపతి తదితరులు పాల్గొన్నారు.

డీఎంహెచ్‌వోకు నర్సెస్ స్ట్రగుల్ కమిటీ వినతి



డీఎంహెచ్‌వో నరసింహ నాయక్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న నర్సెస్ స్ట్రగుల్ కమిటీ సభ్యులు

కాకినాడ క్రైం: స్థానిక జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో మంగళవారం గ్రీవెన్స్ వేదికగా నర్సెస్ స్ట్రగుల్ కమిటీ (రాష్ట్రంలోని అన్ని నర్సింగ్ అసోసియేషన్ల సంఘం)కి చెందిన 40 మంది సభ్యుల బృందం డీఎంహెచ్ఓ డాక్టర్ నరసింహ నాయక్‌ను కలిశారు. తమ సమస్యల పరిష్కారం కోరుతూ వారు ఆయనకు వినతిపత్రాన్ని సమర్పించారు. కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేసిన ముఖ్యమంత్రి సంకల్పాన్ని కొనియాడారు. అయితే 2014 కంటే ముందు ఉన్న వారిలో ఎస్ఆర్‌హెచ్‌ఎం పరిధిలో పనిచేసిన నర్సింగ్ సిబ్బందికీ అవకాశం కల్పించాలని విన్నవించారు. ప్రతి నెలా సకాలంలో జీతాలు అందేలా స్ట్రగుల్ కమిటీ తరఫున నివేదించాలని కోరారు. ఈ నెల జీతాలు జమకాని విషయాన్ని డీఎంహెచ్‌వో దృష్టికి తీసుకెళ్లారు. పీహెచ్‌సీలలో స్టాఫ్ నర్సుల భద్రతపై చర్యలు తీసుకోవాలని కోరారు. సెక్యూరిటీ లేకపోవడం వల్ల నైట్ డ్యూటీలు చేసే నర్సుల భద్రత ప్రశ్నార్థకంగా మారిందని ఆవేదన వెలిబుచ్చారు. ఈ సందర్భంగా కొద్ది రోజుల క్రితం తాళ్లపూడి మండలం అన్నదేవరపేట పీహెచ్‌సీలో నైట్ డ్యూటీలో ఉన్న స్టాఫ్ నర్సును ఓ తాగుబోతు భయపెట్టిన ఉదంతాన్ని ప్రస్తావించారు. సదరు సమస్యపై తక్షణమే స్పందించిన నాయక్ తగిన భద్రత కల్పిస్తామని హామీ ఇచ్చారు. పీహెచ్‌సీ స్థాయిలో ముగ్గురు స్టాఫ్ నర్సులు మాత్రమే పనిచేస్తున్నారనీ, మరో నర్సును నియమించాల్సిన అవసరం ఉందనీ తద్వారా ఎప్పుడైన నర్సు సెలవు పెడితే ప్రజలకు అందించే వైద్య సేవలకు ఆటంకం ఉండదని అన్నారు. దీంతో మరో నర్సు నియామకానికి అవకాశాన్ని పరిశీలించి నియమించేందుకు తగిన ఆదేశాలిస్తామని డీఎంహెచ్‌వో అన్నారు. సమస్యలపై సానుకూలంగా స్పందించిన డీఎంహెచ్‌వో తన పరిధిలోని సమస్యలను తక్షణమే పరిష్కరించి ఇతర విన్నపాలను ప్రభుత్వానికి నివేదిస్తానని హామీ ఇచ్చారు.

రైల్వేగేటు మూసివేతపై ఫ్లెక్సీలు



గేటు మూసి వేస్తున్నట్టు ఫ్లెక్సీ ఏర్పాటు చేసిన రైల్వే అధికారులు

సామర్లకోట: స్థానిక రైల్వే గేటు మూసి వేతపై ప్రజలకు అవగాహన కలిగేలా ఫ్లెక్సీలు ఏర్పాటు చేసినట్టు రైల్వే స్టేషన్ మేనేజరు ఎం.రమేష్ తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ స్థానిక గాంధీ చౌక్ నుంచి కాకినాడ వెళ్లు మార్గంలో ప్రయాణికులు గేటు వరకు వెళ్లకుండా ముందుగానే గేటు మూసి వేసినట్లు ఫ్లెక్సీలు ఏర్పాటు చేశామని తెలిపారు. సామర్లకోట-కాకినాడ రోడ్డులో ఉన్న రైల్వే గేటు బుధవారం నుంచి మార్చి 6వ తేది వరకు మూసి వేయనున్నట్టు తెలిపారు. రైల్వే గేటు పరిధిలో ట్రాక్ మరమ్మతుల వల్ల గేటు మీదుగా రాక పోకలు నిషేధించినట్టు తెలిపారు. దాంతో బ్రిడ్జి మీదుగా రాకపోకలు సాగించాలని ఆయన సూచించారు. ఈ అసౌకర్యాన్ని ప్రయాణికులు గమనించాలన్నారు.

అపర్ణాదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు

పిఠాపురం: గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో వేంచేసిన అపర్ణాదేవి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఉదయం ఆలయ అర్చకుడు ప్రభాకరరావు ఆధ్వర్యంలో అమ్మవారికి విశేష పూజలు చేశారు. అనంతరం వెండి చీర, గాజులు, పుష్పాలతో ప్రత్యేక అలంకరణ చేసి భక్తులకు దర్శనాలు కల్పించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

అభాగ్యులకు అండగా రోటరీ సన్‌రైజ్ క్లబ్



రవికుమార్ కుటుంబ సభ్యులకు నగదు అందిస్తున్న రోటరీ సన్‌రైజ్ క్లబ్ సభ్యులు

బోట్‌క్లబ్: ఆపదలో ఉన్న వ్యక్తులను ఆదుకోవడంతో తమ క్లబ్ ఎప్పుడు ముందుంటుదని రోటరీ సన్ రైజ్‌క్లబ్ అధ్యక్షులు కమల్ సందీప్ అన్నారు. రోటరీ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా క్లబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం ద్రాక్షారామం సమీపంలోని వెల్ల సావరం గ్రామానికి చెందిన చేనేత కార్మికుడికి రూ. 50 వేలు ఆర్థిక సహాయం చేశారు. గ్రామానికి చెందిన అల్లం రవికుమార్ కుటుంబ పరిస్థితులు స్నేహితుల ద్వారా తెలుసుకున్న సభ్యులు అతని కుటుంబానికి అండగా నిలిచారు. ఇటీవల రవికుమార్ కుమారుడు నిరంజన్ కుమార్ బ్లడ్ క్యాన్సర్‌తో మరణించారు. అతని వైద్యం కోసం కూడా వారు అప్పులు చేయడంతో వారి ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని అతను వ్యాపారం చేసుకునేందుకు ఈ ఆర్థిక సాయం చేసినట్లు క్లబ్ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు ఏవీ రంగారావు, వి.నగధర్, వి.దుర్గా మహేష్ పాల్గొన్నారు.

యండపల్లిలో జిల్లా టాస్క్‌ఫోర్స్ టీం పర్యటన



యండపల్లి ఆరోగ్య కేంద్రంలో రికార్డులు తనిఖీ చేస్తున్న టాస్క్‌ఫోర్స్ అధికారులు

కొత్తపల్లి: మండలంలోని యండపల్లిలో మంగళవారం జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందం పర్యటించింది. రీ ప్రోడక్ట్ చైల్డ్ ప్రోగ్రాం కార్యక్రమంలో భాగంగా గ్రామంలో పర్యటించి ప్రజలకు అందుతున్న ఆరోగ్య సేవలపై ఆరా తీస్తున్నట్టు నోడల్ అధికారి వి.అరుణ తెలిపారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ప్రభుత్వం పరంగా వైద్య సిబ్బంది ఎటువంటి సేవలు అందిస్తున్నారు, వైద్య సిబ్బంది సమయపాలన పాటిస్తున్నారా ? లేదా ? పాఠశాలల విద్యార్థులకు వైద్య పరీక్షలు పూర్తిస్థాయిలో నిర్వహిస్తున్నారా ? ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సేవలు అందుతున్నాయా ? అనే అంశాలపై గ్రామస్తులను ఆరా తీశారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. పలు రికార్డులు, ఆపరేషన్ థియేటర్, మందుల నిల్వలను పరిశీలించారు. ఓపీ నమోదుపై ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సుష్మను వివరాలు అడిగి తెలుసుకున్నారు. నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని నోడల్ అధికారి అరుణ తెలిపారు. కార్యక్రమంలో స్టాటిస్టికల్ అధికారి బి.విజయలక్ష్మి, నేషనల్ హెల్త్ మిషన్ జిల్లా ప్రోగ్రాం అధికారి మహేశ్వరరావు, డేటా మేనేజర్ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులపై ప్రత్యేక శ్రద్ధ



రైల్వే స్టేషన్ పరిశుభ్రతపై మాట్లాడుతున్న రవికాంత్

సామర్లకోట: రైల్వే స్టేషన్ పరిధిలో పారిశుధ్య పనులపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నట్టు రైల్వే సీనియర్ సెక్షన్ ఇంజినీరు రవికాంత్ తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ రైల్వే స్టేషన్ పరిధిలో కాంట్రాక్టుకు ఇచ్చిన నలుగురు సిబ్బంది నిర్వహణ లోపంతో పారిశుధ్యం అధ్వానంగా తయారైందని, దీంతో మార్చి నెల నుంచి కొత్త విధానం అమలు చేయనున్నామన్నారు. రైల్వే స్టేషన్ ఆవరణలో ఎక్కడా చెత్త లేకుండా చేసేలా టెండర్లు పిలుస్తున్నామని, నిర్వహణ లోపం తలెత్తితే కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకునేలా నిబంధనల్లో పొందుపరచినట్టు తెలిపారు. సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో పీబీ దేవం గ్రామంలో అండర్ పాస్ సదుపాయం కల్పించాలని ఆ గ్రామం పంచాయతీ నుంచి తీర్మానం వచ్చిందని రైల్వే స్టేషన్ మేనేజర్ ఎం.రమేష్ తెలిపారు. ప్రయాణికులు తప్పని సరిగా డస్ట్ బిన్లను ఉపయోగించుకోవాలని సూచించారు. చీఫ్ హెల్త్ సూపర్‌వైజర్ కల్యాణి, చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టరు ఏవీకె శశికాంత్ తదితరులు పాల్గొన్నారు.

కొత్త నీటికి కోనేరు సిద్ధం



నీరు నింపడానికి సిద్ధం చేసిన కోనేరు

సామర్లకోట: మహాశివరాత్రి ఉత్సవాలు, స్వామి వారి కల్యాణాన్ని దృష్టిలో ఉంచుకొని పంచారామ క్షేత్ర ఆలయ కోనేరులో నీటిని పూర్తిగా తొలగించి కొత్త నీటితో కోనేటిని నింపేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు ఈఓ బళ్ల నీలకంఠం తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక విలేకర్లతో మట్లాడుతూ మార్చి ఆరో తేదీ నుంచి ఆలయంలో కల్యాణం, మహాశివరాత్రి ఉత్సవాలు ప్రారంభమవుతాయని తెలిపారు. దీనిని దృష్టిలో ఉంచుకుని ఆలయానికి వచ్చిన భక్తులు ఆలయ కోనేటిలో స్నానాలు చేస్తారని, వారికి ఇబ్బంది లేకుండా ఉండేలా ఇప్పటి వరకు ఉన్న నీటిని తీసివేసి కోనేటిని ఎండ బెట్టినట్టు చెప్పారు. బుధవారం నుంచి గోదావరి జలాలతో నింపనున్నట్టు తెలిపారు.